# జీవన సామాన్యం

అదొక అద్భుతమైన కాలం. తరవాత ఎదిగిన జీవితంలో చాలా అల్పంగా అంత వుత్సాహంగా కనపడని అనేకానేక అల్లీబిల్లీ విషయాలు ఎంతో మనోహరంగా వుద్విగ్నంగా కనపడే పదిహేడేళ్ళ కుర్రాడి కాలం.

అప్పారావుకి సరిగ్గా అదే కాలంలో ఎనిమిది అంతస్థుల ఆ లాడ్జిలో ఉద్యోగం దొరికింది. ఉద్యోగం దొరికిన మొదటి వారంలోనే వాడి కంట్లో పడకూడని, పడాల్సినవీ చాలా దృశ్యాలు తారసపడ్డాయి. మంచీ చెడుల తర్కానికి వెళ్ళలేని వాడి వయసు ఆలోచనకి అన్నీ అద్భుతంగా హాయిగానే వున్నాయి.

ఆ లాడ్జిలో దిగేవారికి ఏ గదీ ఎవరి సొంతమూ కాదు. కానీ వున్నంతసేపూ ఆ గది వాళ్ళదే. రకరకాల వ్యాపకాలు, అనేకరకాల జీవితాలు... ఎదగాలనే తాపత్రయం కొందరికి... వలవేసి ఎవర్నో లోబరచుకోవాలనే ఆశ కొందరికి. దరిద్రపు రొటీన్ నుంచి నిజంగా హాయిగా ఒక్కరోజేనా బతకాలనే ఆకాంక్ష కొందరికి...

ఎనిమిది అంతస్తుల ఆ జీవనకేంద్రం ఆరు నెలల్లో అప్పారావుని వాడి మగజీవితపు ఆరిందాని చేసింది.

సెలఏరులాంటి వాడి జీవితానికి వో సముద్రపు విస్తృతి తెలుస్తోంది. తన శరీరంలోని నవ్యత, కొత్తరకపు ఉద్రేకం వాడికే ఆశ్చర్యంగా వుంది. స్త్రీ అన్న మరో సముద్రపు అలలు అల్లీబిల్లీగా వాడి ఆలోచనని తాకి, తట్టి వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

అప్పారావుకి జీవితం కొంచెం విశ్రాంతిగా వుంది. చేతిలో టిప్స్ తాలూకు డబ్బు నిండుగా కదులుతోంది. ఏరకమైన బాదరబందీలేని వాడి వయసు అటూ యిటూ చూస్తోంది.

లాడ్జిలో తనతో పనిచేసే వాళ్లలో సీనియర్లున్నారు. వాళ్ళకి సీనియర్ అనుభవాలున్నాయి. వాటి తాలూకూ వివరాలు, డబ్బుకి తమస్థాయి ఆడవాళ్ళు దొరికే స్థలాల ఆనుపానులు వాళ్లద్వారా అప్పారావుకి తెలుస్తూనే వున్నాయి.

మరి నాలుగు రోజులు గడిస్తే ఏం చేసేవాడో? కానీ సరిగ్గా అదే సమయంలో అదే వుద్విగ్నతలో అప్పారావుకి అలివేలు కనిపించింది. తనకి కనిపించిన ఆ అందం పేరు అలివేలు అని తెలుసుకోటానికి అప్పారావుకి మూడు రోజులు పట్టింది. ఎక్కడ ఎలాకూచుంటే అలివేలు అందాన్ని అంగాంగం తృప్తిగా, తన్మయంగా చూసుకోవచ్చో కనిపెట్టటానికి మరో రెండు రోజులు పట్టింది అప్పారావుకి.

మొత్తానికి వో పదిరోజుల్లో అప్పారావు జీవితం ఆసాంతం మారిపోయింది.

కళ్ళకి కనిపించే దూరంలో కూచుని వో స్త్రీని కేవలం చూట్టంలో అంత మధురిమ వుందన్న అనుభవం వాడికి మరో లోకంలా వుంది. ప్రపంచంలోని స్త్రీలందరూ వేరు... అలివేలు వేరు అన్నంత తమకంగా వుంది అప్పారావుకి.

అప్పారావు పనిచేస్తున్న లాడ్జికి ఎదురుగా పదిహేనంతస్థుల పెద్ద భవంతి తయారవుతోంది. అక్కడికి కూలికోసం వచ్చిన అనేకానేక కూలీలలో అలివేలు ఒకత్తి. కానీ అప్పారావుకి మాత్రం అలివేలు వేరు. పగలు అలివేలు అక్కడికి పనికి వచ్చే సమయంలో వాడికి వుద్యోగం చెయ్యాలనిపించటం లేదు.

ఒంట్లో బావుండలేదని, ఎవరో అమ్మమ్మకి ప్రాణం మీదకి వచ్చిందని రకరకాల వంకలతో రెండురోజులు డ్యూటీ ఎగ్గొట్టాడు. ఎగ్గొట్టిన డ్యూటీ లాడ్జివాళ్ల కంట్లో పడుతుందేమోనని, గోడమూల ఒకరోజు, లారీల సందులో ఒకరోజు నక్కినక్కి కూచుని గడిపాడు.

అలివేలు కేంద్రంగా వాడికి వొంట్లో ప్రతిక్షణం చిత్రమైన వొణుకు.. అలివేలు కనిపించినప్పుడు ఎంత ఉద్వేగమో మరి కాస్సేపట్లో కనిపించదేమో అన్న అమితమైన బెంగ.

వాడిస్థితి వాడికే తెలియని అయోమయం. పద్దెనిమిదో ఏట అడుగుపెడుతున్న

వాడికి అది శరీరపు కోరికో తెలియటం లేదు, వాడి బతుకు పరిస్థితిని మించిన అనుభూతో తెలియటంలేదు.

క్రమేపి డ్యూటీల్లో సర్దుబాటు కుదరక పని ఎగ్గొట్టటం మొదలెట్టాడు. పెద్దనిధి అని భావించిన టిప్పుల డబ్బు కాస్తా కరిగిపోయింది. అయినా అప్పారావుకి తృప్తిగా వుంది. ప్రకృతి సహజమైన జీవితం గడుపుతున్న తృప్తి.

వాడికి ఒకటే బెంగ.. ఆ అలివేలుకి తన మనసు తెలుసా.. తన తహతహ తెలుసా.. ఆమెకోసం తను పడుతున్న యాతన లీలగానైనా తెలుసా.

ఆ పెద్ద బిల్డింగ్ నిర్మాణంలో, నానా రణగొణధ్వనిలో దుమ్మూ, ఛండాలం మధ్య అప్పారావు మూగ ఆశ. ఓ దారి తెలియని ఆసక్తి.

చివరికి వోరోజు అలివేలు అప్పారావు వేపు. సూటిగా చూసింది. ఆ తర్వాత నవ్వింది... ఆ తర్వాత మాట్లాడింది. ఆ తర్వాత అప్పారావూ మాట్లాడాడు. అమ్మానాన్నా తెలియని వాడి అనాథ పసితనం దగ్గర్నుంచి యిప్పటి ఎనిమిది అంతస్థుల లాడ్జిలో వుద్యోగం వరకూ తన బతుకుని అలివేలుకి గొప్ప వుత్సాహంగా చెప్పుకున్నాడు. అప్పారావంతగా కాకపోయినా అలివేలూ తన గురించి చెప్పుకుంది.

నీళ్ళు తోడేప్పుడు అలివేలు కాలి కండరాల కదలిక దగ్గర్నుంచి ఆమె చెంగు దోపుకునే అందం వరకూ... అలిసిన అలివేలు ముఖంలోని అందం దగ్గర్నుంచీ విరగబూసినట్టు నవ్వే నవ్వు వరకూ అప్పారావు ఆరాధన అలివేలుకి తెలిసింది. నిష్కల్మషంగా వాడు చెప్పే మాటల్లోని మగతనం అలివేలుని పట్టుకుంది.

మరో పదిరోజులు గడవకముందే వాళ్ళ కోరికలు పెనవేసుకున్నాయి. వో సాయంత్రం పని అయ్యాక వెళ్ళిపోకుండా అక్కడే వుండిపోయింది అలివేలు. ఆ సాయంత్రం, ఆ రాత్రి అప్పారావుకి మరో జీవితం... లైట్లులేని చీకట్లో... మట్టిలో... పరిశుభ్రమైన ఆ శరీరాల చేరువ యిద్దరికీ మరో జీవితమే..

ఓ పద్దెనిమిదేళ్ళ లాడ్జిబాయ్, ఓ కూలి పిల్లతో వో రాత్రి గడిపాడు. అనేకానేక విషయాల ముందు చాలా సామాన్యమైందే. ఆ మర్నాటి నుంచీ ఓ కుళ్ళు కాలవ పక్క ఓ చిన్నరేకుల గదిలో వాళ్ళిద్దరూ కలిసి బతకటం ఆరంభించారు. అదీ సామాన్యమే.

కానీ యిప్పటికే అలివేలు ముగ్గురు అప్పగార్లు అర్థరాత్రి రోడ్డుమీద వ్యభిచార జీవితం... ఏరోజు ఏం జరుగుతుందో తెలియని జీవితం గడుపుతున్నారు. అలివేలులాగే కూలీ జీవితం ఆరంభించిన అనేకమంది నానా దరిద్రాలకీ లొంగి చివరికి అర్థరాత్రి రోడ్లమీద వ్యభిచార జీవితానికి చేరారు. నడిచే యంత్రాల్లా, చీకటిలో నవ్వే శరీరాల్లాగా ఏ రాత్రి ఏం జరుగుతుందో తెలియని దారుణాల్లా మారేరు. అలా మారనందుకు

అలివేలుకి ఎంతో తృప్తి.

చాలామంది అప్పారావు సీనియర్లు ... వారానికో, పదిరోజులకో ఓ లెఖ్ఖలా స్త్రీ శరీరాన్ని పది పదిహేడు నిముషాలు కొనుక్కుని జీవితం గడిపేస్తున్నారు. వాళ్ళలా అయిపోబోతూ ఆగిపోయిన జీవితానికి అలివేలు దక్కటం అప్పారావుకి తృప్తే.

పేదరికం చాలామందిని నీతిగా బతకనివ్వదు. వీళ్ళిద్దరి జీవితంలో గొప్పతనం ఏంలేకపోవచ్చు. కాని వాళ్ళ బతుకుల స్థాయికి ఆ మాత్రం తృప్తి, ఆ మాత్రం సంసారం అసామాన్యమే.

– ఆదివారం, సచిత్ర వారపత్రిక 3-11-1991